కళాశాల హాస్టల్‌పై విచారణ

విశాలాంధ్ర-జి.మాడుగుల : స్థానిక జూనియర్ కళాశాల బాలుర వసతి గృహంలో మంగళ వరం ఏటీడబ్ల్యూఓ తిరిపల్ విచారణ చేపట్టారు.వసతి గృహంలో గంజాయి తాగి విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణపై జులై నెలలో డిప్యూటీ కలెక్టర్ శర్మ నేతృత్వంలో కలెక్టర్ విచారణ చేయించారు. అప్పట్లో విద్యార్థులు మారుతాం, బుద్దిగా ఉంటాం అని హామి ఇచ్చిన వారం తిరగక ముందే అదే వసతి గృహంలో విద్యార్థుల మధ్య కొట్లాట జరిగింది. ఈ విషయం పై ఉన్నతాధికారులు స్థానిక ఏ టీ డబ్ల్యు ఓ తీరిపాల్ కు విచారణ చేసి నివేదిక ఇవ్వమని ఆదేశించడంతో మంగళవారం కాలేజి వసతి గృహంలో విచారణ చేపట్టారు. ఈ విషయం పై ఏ టీ డబ్ల్యూ ఓ తీరిపల్ కు విలేకరులు అడగగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, విచారణ నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

చత్తీష్‌ఘడ్ విలేకరులపై పెట్టిన కేసు ఎత్తివేయాలి

- పూర్తి విచారణ చేయాలి
- కారులో గంజాయి పెట్టిన పోలీసులపై కేసులు పెట్టాలి
- ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవి సుబ్బారావు డిమాండ్

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన విలేకరులపై పెట్టిన అక్రమ గంజాయి కేసు ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయు కార్యదర్శి సోమ సుందర్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు నాగరాజు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని చింతూరు, చత్తీస్‌ఘడ్‌లోని కుంట పోలీస్ స్టేషన్ సి.ఐ.లు విలేకరులపై ఇంత కక్షపూరితంగా వ్యవహరించిన శైలి అమానుషం అన్నారు. పాత్రికేయులు ఇసుక మాఫియాకి సంబంధించి బెదిరింపులు చేసారనే ఆరోపణలను పరిగణలోకి తీసుకుంటే చట్టపరంగా విచారణ చేయాలి.అదే సమయంలో విలేకరులు వార్తా సేకరణ కోసం వచ్చారా, బ్లాక్మెయిలింగ్ కోసం వచ్చారా అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇసుక మాఫియా ఒత్తిడిలకు లొంగి విలేకరులపై కేసు పెట్టిన పోలీసులు, అక్రమంగా శబరి నది నుంచి ఇసుక తరలిస్తున్న మాఫియాపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నిస్తున్నాం. ఒకవేళ ఇసుక వ్యవహారంలో విలేకరుల తప్పయితే, ఇసుక మాఫియా ఫిర్యాదు చేసి ఉంటే, దానికి సంబంధించి మాత్రమే కేసు పెట్టాలి. కానీ పోలీసులే 40 కేజీల గంజాయిని కారులో పెట్టారని వచ్చిన ఆరోపణపై కూడా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలి. విలేకరులు బస్ చేసిన సిసి ఫుటేజ్ మొత్తం బయట పెట్టాలి. పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే ఇలా గంజాయి కేసులు పెట్టడం అన్యాయం.ఉన్నత స్థాయి పోలీస్ అధికారులకు, కుంట సీ.ఐ.పై ఒక జర్నలిస్టు ఫిర్యాదు చేశారనే కక్షతో ఈ కేసు పెట్టించారని స్థానికులు పేర్కొంటున్నారు. అసలు 40 కేజీల గంజాయి కారులో పెట్టారు అంటే గంజాయి వ్యాపారులతో వీళ్లకు ఉన్న లింకులపై ఇప్పుడు కొత్త అనుమానాలకు పోలీసులే తెరతీశారు. పోలీసులే కారులో గంజాయి పెట్టించారనేది నిజమైతే, చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు చట్టాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయించడం తీవ్రంగా ఖండిస్తున్నాం. చత్తీస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన విలేకరులపై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టిన తప్పుడు గంజాయి కేసును తక్షణ ఎత్తివేసి విలేకరులను విడుదల చేయాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన పోలీసులపై కేసులు పెట్టాలని ఒక ప్రకటనలో యూనియన్ డిమాండ్ చేసింది.

మాతాశిశు మరణాలను అడ్డుకట్ట వేయండి

వైద్య సిబ్బందికి ఐటీడీఏ పీవో సూచన

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మతాశిశు మరణాల నివారణకై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వారి సంరక్షణకు తోడ్పాటునివ్వాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ స్పష్టం చేశారు. మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన దుంబ్రిగుడ పీహెచ్సీలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. శిశు జనన నీరీక్షణ కేంద్రంలో సందర్శించిన ఆయన నెలల నిండిన గర్భిణులతో మాట్లాడుతూ పోషకాహార కల్పనపై ఆరా తీశారు. గర్భిణులకు నాణ్యమైన భోజన మెనూను పక్కగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. నెలలు నిండి అసుపత్రికి రాని వారిపై సమాచారం అందిస్తే అటువంటి వారికి ఆసుపత్రిలో చేర్పించేందుకు రెవెన్యూ శాఖ ద్వారా చేరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయుర్వేద వైద్యశాలలో సందర్శించిన ఆయన మందులను పరిశీలించారు. అయిదేళ్లుగా అటెండరే విధులు చేపడుతుండడంపై ఆయన విస్మయం చెందారు. నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ను ఆయన పరిశీలించి వైద్య అవసరాలకు వినియోగించాలని సూచించారు. ఈనెలాఖరులోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు ఆసుపత్రి చుట్టూ ఉన్న తుప్పలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో సందర్శించిన ఆయన బాలింతలకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. రక్తపరీక్ష గదిని పరిశీలించిన ఆయన మూడు నెలలుగా వచ్చిన మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో కేసులు ఎక్కువగా నమోదయ్యాయని. సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నెల వారి పరీక్షలో భాగంగా రక్తపరీక్షను చేయంచుకుంటును గర్భిణికి హిమోగ్లోబిన్ పరీక్షను దగ్గర ఉండి చేయించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులతో నైట్ వాచ్మెన్ను నియమించేలా చూసుకోవాలని వైద్యాధికారిణి అంభికను సూచించారు. అనంతరం అరమ పంచాయతీ జాకరవలస పరిశీలించారు. జామ గూడా, కిలోగూడ ఆంగ్ల మాధ్యమ బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు టీడబ్ల్యూజెఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మౌలిక సదుపాయాల ప్రణాళిక

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : పిఎం గతి శక్తి పీఎంజీఎస్ ప్రాజెక్ట్ సౌత్ జోన్ (కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు మొదలగు ఐదు దక్షిణాది రాష్ట్రాలు) మూడవ జిల్లా స్థాయి కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ మంగళవారం కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురం లో జరిగింది. ఐదు రాష్ట్రాల నుండి పాల్గొన్న 14 జిల్లాలలో అల్లూరి సీతారామ రాజు జిల్లా నుండి కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం విశేషం. జ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణల ఆధారంగా సమకాలీకరించబడిన, సంపూర్ణమైన, సమగ్రమైన ప్రణాళిక ద్వారా మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడానికి ప్రవేశ పెట్టిన పథకమే పిఎం గతి శక్తి. సమగ్రత, ప్రాధాన్యత, ఆప్టిమైజేషన్, సమకాలీకరణ, విశ్లేషణాత్మకత మరియు డైనమిక్ అనేవి పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్ కు ఆరు స్తంభాలు. జాతీయ కార్యక్రమం కింద ప్రాజెక్టుల సమగ్ర ప్రణాళికలో 'ఏరియా డెవలప్‌మెంట్ అప్రోచ్' పై దృష్టి సారించిన ప్రాంతీయ-నిర్దిష్ట వర్క్‌షాప్‌లలో ఇది మూడవదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ ప్రభుత్వ పరిశ్రమలు, కోయిర్ మరియు న్యాయ శాఖ మంత్రి శ్రీ పి. రాజీవ్, రాష్ట్ర శాఖలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల అధికారులతో పాటు 14 జిల్లాల జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారని కలెక్టర్ వివరించారు.

రెండు వేరువేరు కేసుల్లో 80 కేజీల గంజాయి పట్టివేత

గంజాయి విలువ రూ.4 లక్షలు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ వారి ఆదేశాలతో గంజాయి నిర్మూలనలో రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక భాగంగా మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద మోతుగూడెం ఎస్సై జి గోపాల్‌రావు వాహన తనిఖీ నిర్వహించగా 2 వేరువేరు కేసుల్లో 80 కేజీలు గంజాయిని పట్టుకున్నామని తెలియజేశారు. మొదటి కేసులో కెందుగూడ గ్రామం నుంచి ఖమ్మం కు చెందిన ప్రశాంత్ మరియు మణిసందీప్ లు 20 కేజీల గంజాయిని తరలిస్తుండగా మోతుగూడెం పోలీసులు పట్టుకున్నామని తెలియజేశారు. వీరి వద్ద నుంచి ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండవకేసులో ఒడిస్సాలోని నెమలపాలెం నుంచి భద్రాచలంకు చెందిన నలుగురు వ్యక్తులు 60 కేజీల గంజాయి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను ఒక బైక్‌ని పట్టుకున్నామన్నారు. ఇంకో బైక్ మీద ఇద్దరు వ్యక్తులుఅక్కడ నుంచి తప్పించుకొని పారిపోయారు అన్నారు. ఈసందర్భంగా చింతూరు సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ చింతూరు సర్కిల్ పరిధిలో వినూత్నంగా వాహన తనిఖీ నిర్వహిస్తున్నామని ఒడిస్సా చత్తిస్గఢ్ తెలంగాణ పోలీస్ వారితో కోఆర్డినేటివ్ చేసుకుంటూ గంజాయి నిర్మూలన చేపడతామని తెలియజేశారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడంలో కూటమి మాట తప్పింది

విశాలాంధ్ర -జీకే వీధి: అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వము సూపర్ సిక్స్ పథకంలో, ప్రతి వ్యవసాయ రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా, ఒక రైతుకు ఏడాదికి 20.000 రూపాయలు ఇస్తానన్న హామీ ఏమైందని సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు ప్రశ్నించారు. మండలంలో రింతాడ పంచాయతీ పరిధిలోనీ కొన్ని గ్రామాలలో సందర్శించినప్పుడూ నేలపాడు, దుచ్చారాపాలెం, గ్రామ రైతులతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వములో రాష్ట్ర ముఖ్యమంత్రి. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి 20.000 రూపాయలు ఇస్తామని. చెప్పిన ఎన్నికల హామీ ఏమైందన్నారు. ఈ హామీపై ఖరీఫ్ సీజన్లో రైతులు ఎన్నో ఆశలతో ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తూ చూస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వము పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో 20.000 రూపాయలు జమ చేసి హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీలునీ అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు డిమాండ్ చేస్తారు. ఈ కార్యక్రమంలో వంతల భోగిరాజు ముర్ల శ్రీరాములు కొర్ర సైతు జైరామ్ వంతల సువర్ణ పాంగి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గంగులయ్య సమక్షంలో జనసేనలో చేరిన యువకుడు

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ రష్యాగుడ గ్రామానికి చెందిన కిళ్ళో టక్కుబాబు అనే యువకుడు జనసేన పార్టీలో చేరారు. తానే స్వయంగా పాడేరు వెళ్లి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యను కలిసి తాను జనసేన పార్టీ లో చేరాలనుకుంటున్నానని, తనను తమ పార్టీలో చేర్చుకోండి అని, నాకు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదని, కానీ జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, పాలన విధానం నచ్చి చేరాలని వచ్చానని చెప్పారు. మా గ్రామాలకు జనసేన పార్టీ ఇప్పుడు అత్యంత అవసరమని, తమ గ్రామ పెద్దలందరికి ఈ విషయాన్ని తెలియజేసి వచ్చానన్నారు. మార్పు కొరకు నా వంతు పాత్ర చిన్నదే అయినా చిత్తశుద్ధిగా పని చేస్తానని చెప్పారు. దీంతో గంగులయ్య ఆ యువకుడికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

హెల్త్ వాలంటీర్లను నియమించాలి

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, కళాశాల పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్షుడు కె కార్తీక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో, కేజీబీవీ పాఠశాలలో మంగళవారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలలో గణిత శాస్త్రం ఉపాధ్యాయులు లేరని వెంటనే నియమించాలని చెప్పారు. పాఠశాలఎల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని కోరారు. గతంలో హెల్త్ వాలంటీర్లు పాఠశాలలో ఉండటం వల్ల పిల్లల ఆరోగ్య పరిస్థితులు ప్రత్యేకంగా చూసుకునేవారనీ చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు దేవుళ్ళు, ఇమ్మానుయెల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కాకరపాడు రోడ్డు నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీ కాకరపాడు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం అధికారులకు దరఖాస్తులు ఎన్నో సార్లు ఇచ్చామనీ, అయినా ఇప్పటికీ రోడ్డుఅలానే ఉందన్నారు. వర్షాకాలం వర్షాలు కురిస్తే కనీసం బురదగా ఉండి నడవటానికి కూడా వీల్లేకుండా ఇబ్బందిగా మారిందన్నారు. గర్భిణీ స్త్రీలు, అనారోగ్యంతో ఉన్న పేషెంట్లకు ఆసుపత్రికి తీసుకోవెళ్లాలన్న, డోలీ మోతలు తప్పడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి మా గ్రామానికి రోడ్డు నిర్మాణం సౌకర్యం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు వేడుకున్నారు.

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

ఆర్‌టిఓకు ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ఆర్టీవో శశికుమార్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు, విద్యార్థులను బస్సులు, క్యాబులు, ఆటోలు వంటి వాహనాలలో విద్యార్థులను సంఖ్యకు మించి ఎక్కించడంవలన విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.అనేక వ్యాన్లు, ఆటో, బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు ప్రభుత్వం ద్వారా పొందిన అనుమతులు లేకపోవడం వలన అనేక యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని అన్నారు.అలాగే మద్యం సేవించి కూడా వాహనాలు నడపడం వలన విద్యార్థుల ప్రాణాలకే ముప్పందని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపై నడిపిస్తున్న యాజమాన్యాలపై అలాగే వాహనాలపై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు దశపర్ని కషాయం ఎంతో ఉపయోగం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : రైతులు ప్రకృతి వ్యవసాయ శాఖను పెంచుకోవాలని, అధిక దిగుబడులకు దశపర్ని కషాయము ఎంతో ఉపయోగకరమని ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ జి అన్నపూర్ణ తెలిపారు.మండలంలోని చింతల వెలగం గ్రామంలో మంగళవారం రైతులచే దశపర్ని కాషాయం తయారు చేయించారు. ఈ సందర్భంగాఅన్నపూర్ణ మాట్లాడుతూ పంటల దిగుబడి పెరగడానికి భూమిని సారవంతం పెంచుకోవడంతోపాటు పంటలపై ఏవిధమైన శత్రువుల గాని తెగుళు గాని ఆశించకుండా చూసుకోవాలని, అప్పుడే ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం జరుగుతుందన్నారు. దశ అంటే 10 రకాల పర్ని అంటే ఆకులు కషాయానికి 10 రకాల ఆకులు వేప,సీ, కారుమామిడి, జిల్లేడు, నేరేడు, మొదలగు పది రకాల ఆకులను కలిపి మెత్తగా చూర్ణంచేసి పచ్చిమిర్చి 50 గ్రాములు గుండగాచేసి వెల్లుల్లి 50 గ్రాములు మెత్తగా గుండా చేసి పొగాకు కాడలు గుండగాచేసి 200 మిల్లీమీటర్ల పావులేటరు ఆవుమూత్రం ఎనిమిది లీటర్ల నీళ్ళల్లో పై పదార్థాలను మొత్తం కలిపి30 నుంచి 45 రోజులు వరకు పులియ పెట్టాలని తెలిపారు. పలు రకాల చీడపురుగులను కాయతొలుచు పురుగులు రసం పీల్చే పురుగులు అచ్చి దోమ తెల్ల దోమ మొదలుకొని నివారించుకోవచ్చు అని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటలపై ఉపయోగించుకోవడం వలన బహుళ ప్రయోజనం కలుగుతుందని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి, సిబ్బంది వై కృష్ణ, ఎం సింహాచలం, త్రినాథ్ రైతులు పార్వతి, తేజ సరితలు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు అభివృద్ధి పనులపై అవగాహన

విశాలాంధ్ర-సీతంపేట : మండలం 53 పంచాయతీల సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులకు క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులు పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. డిఎల్పిఓ పాలకొండ వారు, ఎంపీడీవో గీతాంజలి, ఈవోపీఆర్డి కే. సత్యం ప్రతి గ్రామంలో కూడా ఫంక్షనల్ ఎస్ డబ్ల్యూ పిసి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఉండడం చాలా అవసరమని గౌరవ డిఎల్పిఓ గారు మాట్లాడటం జరిగింది. పారిశుధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ మరియు వర్గీకరణ తడి చెత్త పొడి చెత్త విడివిడిగా ఇంటి నుంచి సేకరించి ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ నందు వర్మి కంపోస్టు తయారు చేయించి పంచాయతీలకు ఆదాయ వనరులుగా ఎస్ డబ్ల్యూ పిసిని తీర్చిదిద్దవలెనని సర్పంచులకు అవగాహన కల్పించారు.

వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలుచేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలుచేయాలని కోరుతూ పలువురు వీఆర్‌ఏలు మంగళవారం స్థానిక శాసనసభ్యులు విజయచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వి.ఆర్.ఎ.ల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎం.ఎల్.ఎ., మంత్రులతో రాయభారం కార్యక్రమంలో భాగంగా ఈరోజు వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. తెలంగాణలో అమలవుతున్న విదంగా వి.ఆర్.ఎ.లకు పేస్కేలు అమలు చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో వున్న మండలాలో వి.ఆర్.ఓ. వాచ్ మాన్.అటెండర్. రికార్డ్ సహాయకుడు పోస్టులకు తక్షణమే వి.ఆర్.ఎ. లకు ప్రమోషన్లు ఇచ్చి బర్తి చెయ్యాలని, నామినిలుగా పనిచేస్తున్న వి.ఆర్.ఎ.లను వి.ఆర్.ఎ.లుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణరావు, సి.ఐ.టి.యు. జిల్లా కోశాదికారి జి.వెంకట రమణ, మండల అధ్యక్షులు కార్యదర్శులు కె.సుధ, శ్రీను. బాబూరావు. విజయ్, ఎస్.కృష్ణ. బి.దిలీప్. పాలక పుష్ప పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని సర్పంచ్‌లు, కార్యదర్శులు సందర్శన

విశాలాంధ్ర -సీతానగరం : స్థానిక పెదబోగిల మేజరు పంచాయతీకి చెందిన చెత్త సంపద కేంద్రాన్ని శిక్షణకార్యక్రమానికి హాజరైన సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సందర్శించారు. పొడి చెత్త తడి చెత్త వేరు చేసే విధానాన్ని ఈఓపిఆర్డి కుమార్ వర్మ వివరించారు. గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్, సుధారాణి, రిసోర్స్ పర్సన్‌లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఏపీ న్యూ సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ 2015 ప్రకారం జీతాలు చెల్లింపు చేయాలి

ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు ఏఐటీయూసీ వినతి

విశాలాంధ్ర-బెలగాం : కార్మిక సంక్షేమం, రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలలో పనిచేస్తున్న పారిశుధ్యం, భద్రతా, చెదపురుగు నివారణ సిబ్బందికి జరుగుతున్న వివక్షను ఆపాలని అలాగే కాంట్రాక్టు లేబరు (రెగ్యులేషన్ & అబాలిశన్) యాక్ట్ 1970, ఎపి రూల్స్ 1971, మన ప్రభుత్వ ఎ.పి. న్యూ సైన్టిఫిక్ శానిటేషన్ పాలసీ 2015 ప్రకారం జీతాలు చెల్లింపు చేయాలని కోరుతూ ఏఐటియుసి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కుమార్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు కలిపి 222 మంది కార్మికులు ఉన్నారని వీరు టివిటి గ్రూపు ఏజెన్సీలో పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలైన వైద్య కళాశాలలు, భోదనా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్యం, భద్రతా, చెద పురుగుల నివారణ నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల అరాచాకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని, 3 నెలలకు ఒకసారి జీతాలు చెల్లింపులు, పిఎఫ్ బకాయి మరియు దోపీడీలు, ఈఎస్ఐ కార్డులు అందజేయకపోవడం ఇలా కార్మికుల శ్రమ దోపిడికి గురౌతున్నారన్నారు. ప్రతీ నెలా కార్మికులకు జీతాలు చెల్లించేటట్లు చేయాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్రను కోరారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల మాదిరిగానే ఈ వైద్యశాలలో కూడా దళారీ వ్యవస్థను నిర్మూలించి, ప్రత్యేక సంస్థ ద్వారా ప్రతినెలా రూ.26 వేలు కనీస వేతనం పెంపుదల చేసి వేలాదిమంది పారిశుద్యం, భద్రతా, చెదపురుగుల నివారణ సిబ్బందికి చెల్లించే ఏర్పాటు జరపవలసినదిగా కోరుతున్నామన్నారు. ప్రభుత్వాలు మారినా సంవత్సరాలు తరబడి ఈవృత్తినే నమ్ముకొని కరోనా విపత్తులలో కూడా కుటుంబాన్ని వదులుకొని పేద రోగులకు సేవ చేసుకుంటున్న బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలకు న్యాయం జరిపించిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసీ నాయకులు సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మ, ఎం.చంద్రమౌళి, కావ్య, సుధీర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లను చదివేద్దాం

సిడిపిఓ అనంతలక్ష్మి

విశాలాంధ్ర-పాచిపెంట : బేటీ బచావో- బేటీ పడావో (ఆడపిల్లలను రక్షిద్దాం ఆడ పిల్లలను చదివిద్దాం) కార్య క్రమం మండలంలో గల సరాయివలస ఏకలవ్య బాలికల పాఠశాలలో సిడిపిఓ అనంతలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం బాలికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు వలన జరిగే అనర్ధలు, ఆడపిల్లలు యొక్క ఆవశ్యకత, విద్య, ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రత మొదలుగు అంశాలు గురించి అవగాహన కల్పించడ0 జరిగింది. విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాలలో స్థిరపడి అటు తల్లిదండ్రులకు ఇటు పాఠశాల సిబ్బందికి మంచి పేరు తేవాలని అన్నారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు చేసి ఉన్నత విద్యను అందిస్తుందని వాటిని వినియోగపరుచుకుని ఉన్నత స్థానాలలో స్థిరపడి మీ గ్రామాలకు మీ కుటుంబాలకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీచర్స్, అంగన్వాడి సూపర్వైజర్స్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

జంఝావతి జలసమస్యపై సిఎం చంద్రబాబు, మంత్రితో మాట్లాడా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం : నియోజకవర్గంలో అత్యంత కీలకమైన సాగునీటి వనరైన జంఝావతి జల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోను ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు. త్వరలోనే దీనిపై రాష్ట్రప్రభుత్వమంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి ఒడిస్సా ముఖ్యమంత్రితోనూ సంబంధిత అధికారులతో చర్చించే కార్యక్రమం నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే పార్వతీపురం నియోజకవర్గంలో 25 వేల ఎకరాలకు సాగునీరుకు కొరత ఉండదన్నారు. కేంద్రంలోనూ మన రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్రభుత్వము ఉండడమే గాక ఒరిస్సాలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఉండడం వలన ఈ దఫా సమస్య పరిష్కారం జరగడానికి ఎంతో అవకాశం ఉందని తెలిపారు. మరోసారి దీనిపై రాష్ట్రముఖ్యమంత్రితోనూ, సంబంధిత మంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రధాన అజెండాగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

గ్రామపంచాయతీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర - సీతానగరం : గ్రామ పంచాయతీల బలోపేతంపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పంచాయతీలకు పూర్వ వైభవం వస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు.మండలంలోని 35 గ్రామపంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణతరగతులను ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీల పరిపాలన విధానంపైన చెత్త సంపద కేంద్రాల నిర్వహణపైన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకొని పంచాయతీలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో ఉండే చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పొడి చెత్త తడి చెత్త సేకరణతో పాటు పారిశుధ్యం తొలగించాలని కోరారు. గ్రామపంచాయతీ సమావేశాలు నిర్వహణ, గ్రామసభలు నిర్వహణపై కూడా ఇటువంటి శిక్షణా తరగతుల వలన అవగాహన పెంచు కోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ చట్టం అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి శ్రీరాములునాయుడు, ఎంపీడీవో ఎం ఈశ్వరరావు, ఈఓపిఆర్డి కుమార్ వర్మ, పరిపాలనాధికారి ప్రసాద్, టిడిపి అధ్యక్షులు పెంట సత్యంనాయుడు, సాల హరిగోపాలరావు రిసోర్స్ పర్సనులు శశి భూషణరావు, మనోహర్, శ్రీనివాసరావు, పీటర్, సర్పంచులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



విశాలాంధ్ర-బెలగాం : పాయిజన్ సేవించి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణ ఎస్ఐ రవీంద్ర రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన తిరుమరెడ్డి లక్ష్మణరావు (54) ఒక మర్డర్ కేసులో నేరస్తుడు. ఈ విషయంలో కుటుంబీకులు ఎవ్వరూ అతన్ని చేరదీయకపోవడంతో మనస్తాపం చెంది పార్వతీపురం ఆర్టీసీ ఆవరణలో పాయిజన్ సేవించి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పట్టణ ఎస్ఐ రవీంద్రరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర

పేజి : 2

- అల్లూరి సీతారామరాజు
- పార్వతీపురం మన్యం

బుధవారం 14, ఆగస్టు 2024

నేడు గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-జి.కె.వీధి : మండలంలోని రింతాడ పంచాయతీ రింతాడ గ్రామంలో నేడు శ్రీ అభయ ఆంజనేయ గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్టకు ఉత్సవ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మండల నలుమూలల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేసామని భక్తులకు అన్న సమరాధన కూడా నిర్వహించనుమన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పాల్గొని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పేర్కొన్నారు.

పేదలు, వృత్తిదారుల ఇళ్లు కూల్చేందుకు గ్రామ సర్పంచ్ యత్నాలు

- అక్రమాలకు పాల్పడిన రెడ్డి కృష్ణంనాయుడుపై సమగ్ర దర్యాప్తు జరపాలి
- సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు నుండి రక్షణ కల్పించాలి
- ప్రభుత్వానికి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో తూరుమామిడిలో మంగళవారం పేదలు, వృత్తి దారుల కట్టుకున్న ఇళ్లు కూల్చడానికి రెవిన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూరు మామిడిలో 1994 సంవత్సరంలో సోషల్ వెల్ఫేర్ వారు సర్వే నెంబర్ 71లో సుమారు 4 ఎకరాల భూమిని బూరాడ అప్పలస్వామి వద్ద ఇళ్ళ స్థలాల కోసం కొనుగోలు చేశారన్నారు. 1995 సంవత్సరంలో చీపురు మహాలక్ష్మి, బొద్దాన పైడమ్మలకు పట్టాలు ఇవ్వగా ఆ తరువాత బొద్దానా గంగ, బొద్దాన రాజేశ్వరి, బొద్దాన లక్ష్మీ, బొద్దాన గంగ, బొద్దాన సింహాచలం లకుఆ స్థలంలో పట్టాలు ఇచ్చారని, అప్పుడు పాకలు వేసుకోగా కొంత మంది పేదలు, వృత్తిదారులు ఇప్పుడు రేకు ఇళ్ళులు, స్లాబ్ ఇల్లు కట్టుకున్నారన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చిన తరువాత ఇరిగేషన్ శాఖకు కొంత భూమిని రెవెన్యూ అధికారులు 1996వ సంవత్సరంలో బదిలీ చేశారని, అప్పటికే పేదలు కాలువ మినహాయించి ఇల్లు కట్టుకోగా ఇప్పుడు ఆ ఇల్లు కాలువపై ఉన్నాయని పీకి వేయించాలని గ్రామ సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు పేదలపై కక్షగట్టి పంచాయితీ ఎన్నికల్లో ఓట్లు వేయలేదన్న కారణంతో ఇల్లు పీకించి వేయడానికి గత సంవత్సర కాలంగా రెవిన్యూ అధికారులతో బెదిరిస్తున్నాడన్నారు. వి.ఆర్.ఎస్. కాలువ నీరుకు ఎటువంటి ఆటంకం లేకపోయినా సర్పంచ్ కృష్ణం నాయుడు పేదల కూల్చాలని పట్టుదలతో వున్నాడు అని ఇది దుర్మార్గమన్నారు. సదరు కృష్ణం నాయుడు తూరు మామిడి గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో సేకరించిన ఇల్లు స్థలాల్లో పలు అక్రమాలకు పాల్పడ్డాడ న్నారు. తూరు మామిడి రెవిన్యూలో సర్వ నంబర్: 45/2, 47లలో 1-39 ఎ.సే.భూమిని గ్రామానికి సంబంధించిన యోగి రెడ్డి పాపినాయుడు, మచ్చ అప్పలస్వామి, గంట నారాయణమ్మ వారి కుటుంబ సభ్యుల పేరున ఎస్ ఎఫ్ ఏ లోఉన్న భూమిని సర్పంచ్ రెడ్డి కృష్ణం నాయుడు తన కుటుంబ సభ్యుల పేరున రికార్డులు ట్యాంపరింగ్ చేయించి రెవెన్యూ అధికారులను మోసం చేసి డబ్బులు తీసుకున్నాడు అని వీటిపై అనేకసార్లు రెవెన్యూ అధికారులకు సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడుపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఫిర్యాదు చేసినప్పటికీ అప్పటి ప్రభుత్వం వైయస్సార్ పార్టీ అధికారంలో ఉండడంతో కృష్ణంనాయుడు కేసులు లేకుండా బయటపడ్డాడని ప్రభుత్వం ఆదుకుందని అన్నారు. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తన అక్రమాలు బయటపడతాయని తెలిసి తెలుగుదేశం పార్టీ నాయకులను అంట కాగుతున్నాడని, తెలుగుదేశం పార్టీలోకి వెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు జగనన్న కాలనీలో పలు అక్రమాలకు పాల్పడిన రెడ్డి కృష్ణం నాయుడుపై సమగ్ర దర్యాప్తు జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులను, రెవెన్యూ అధికారులను కోరారు. తూరు మామిడిలో పేదలు కట్టుకున్న ఇళ్లకు రెడ్డి కృష్ణం నాయుడు నుండి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు, తూరు మామిడిలో పేదలు కట్టుకున్న ఇల్లే కనిపించాయా అని ప్రశ్నించారు? మక్కువ మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు కానుకొని ఉన్న బైరి సాగరం ఆనుకొని కేవలం 7 సెంట్లు మాత్రమే జిరాయితీ భూమి ఉన్నదని సుమారు 19 ఎకరాలు ఉన్న బైరీ సాగరం చెరువు ఆక్రమణకు గురియిందని బైరి సాగరంలో పెద్దపెద్ద భవంతులు, హోటల్‌లు, పెద్ద కిరాణా మాల్స్, మెడికల్ షాపులు వున్నాయని వీటిపై అనేక మంది అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ రెవిన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వున్నారని ఆరోపించారు అలాగే వెంగాల రాయ సాగర్ ప్రాజెక్ట్ గట్టు దిగువన వి ఆర్ ఎస్ కోసం సేకరించిన భూమిలో ఇతర జిల్లాలు నుండి వచ్చిన వారు పెద్ద పెద్ద భవంతులు, ఇళు కట్టుకున్నారు అని వాటి పై కూడా ఫిర్యాదులు వెల్లాయని కానీ రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు అని అన్నారు, వేంగల రాయ సాగర్ ప్రాజెక్ట్, ఆర్ ఎం సి పరిధిలో 9 ఎల్ కాలువ మేలాపు వలస కాలనీ వద్ద పూర్తిగా ఆక్రమణ కు గురై ఇళ్లు కట్టుకున్నారన్నారు. అలాగే ఆర్ బి సి.లో 13 ఎల్ కాలువ కొండ బుచ్చమ్మ పేట వద్ద పూర్తిగా ఆక్రమణ కు గురి అయిందని వీటి అన్నిటి పై ఎటువంటి చర్యలు లేకుండా కేవలం తూరు మామిడిలో పేదలు, వృత్తిదారుల ఇల్లే కూల్చడానికి ప్రయత్నం చేయడం అంటే పేదలపై కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న సర్పంచ్ రెడ్డి కృష్ణం నాయుడు కు అధికారులు సహకరించ డమేనని అన్నారు. ఇప్పటి కైన తూ రు మామిడి జగనన్న కాలనీ కొనుగోలు పై సమగ్ర దర్యాప్తు జరిపించి. ఇతరుల భూములు తన పేరున మార్చు కొని రెవిన్యూ అధికారులు ను మోసం చేసిన రెడ్డి కృష్ణంనాయుడుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాని, తూరు మామిడిలో పేదలు కట్టుకున్న ఇల్లుకు రక్షణ కల్పించాలి అని రెవిన్యూ అధికారులను, తెలుగు దేశం ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే పేదలందరినీ కదిలించి ఉద్యమిస్తామని అన్నారు. మక్కువ తాసిల్దార్ వివరణ కోరగా సర్వే నెంబర్ 71/4లో 17 సెంట్లు ల్యాండ్ల వి.ఆర్.ఎస్.కెనాల్‌కు కేటాయించడం జరిగింది. గత ప్రభుత్వంలో పేదల కోసం జగనన్న లేఔట్‌లో ఇల్లు స్థలాలకు కేటాయించడం జరిగింది అందులో కొంత ల్యాండ్ ను గవర్నమెంట్ డెవలప్మెంట్ యాక్టివ్ నిమిత్తం ఆ స్థలంలో కొంత మినహాయింపు జరిగింది ఆ స్థలంలో ఇల్లు కట్టుకొని ఆ కాలువను వి ఆర్ ఎస్ కాలువ కూడా ఆక్రమించుకొని ఇల్లు కట్టడం జరిగింది దానిని అసిస్టెంట్ ఇంజనీర్ గ్రహించి సర్వే చేయడం జరిగింది ప్రభుత్వ స్థలంగా గుర్తించడం జరిగింది బిల్డింగ్ తీయని ఎడల చట్ట పరగా చర్యలు తీసుకుంటామని మక్కువ తాసిల్దార్ వివరణ తెలిపారు.

రహదారి భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర-పాలకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో రహదారి భద్రత గురించిన అవగాహన కార్యక్రమం ప్రిన్సిపాల్ హరగోపాల్అ ధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నవిన్ కుమార్ హాజరై రహదారి భద్రత గురించి విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా మైనర్లు అయిన విద్యార్థులు 18 సంవత్సరాలు వచ్చేవరకు వాహనం నడపరాదని అలా నడుపుతూ పట్టుబడిన, యాక్సిడెంట్ చేసిన,మైనర్ తో పాటు వాహన యజమానికి మూడు నెలల కఠిన కారా గార శిక్ష, ఐదు వేల రూపాయలు వరకు జరిమానా, వాహనాన్ని జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు.అలాగే మత్తు పదార్థాలు స్వీకరించి వాహనం నడపరాదని, శిరస్త్రాణం లేకుండా వాహనం నడపడం ప్రమాదకరమని,మితిమీరిన వేగంతో వాహనం నడిపిన అలాగే అధిక లోడుతో వాహనం నడిపిన ప్రమాదకరమని తెలియజేశారు .ప్రమాదాలు చెప్పి రావనీ తగు జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూడవచ్చని ఈ విషయాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు బంధువులకు తెలియజేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ నారాయణరావు విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర గోపాల్ తో పాటు ఏజీఎంట పైల శంకర్రావు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, జి గోవిందరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఘనసత్కారం

విశాలాంధ్ర-సీతానగరం : ఎన్నికల ముందు ఫిబ్రవరి నెలలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం నుండి విచ్చేసిన ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావుకు తిరిగి సొంతజిల్లాకు బదిలీకావడంతో ఆయన మంగళవారం సాయంత్రం రిలీవ్ అయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దుశ్శాలువాకప్పి బోకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ ఈశ్వరరావును మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధిహామీపథకం సిబ్బంది ,సచివాలయం సిబ్బంది సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములునాయుడు, ఈఓ పిఆర్డీ కె. కుమార్ వర్మ, పరిపాలన అధికారి ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కె.చిన్నారావు,జూనియర్ అసిస్టెంట్ గోర్జి శేఖర్, టీడీపి మండల పార్టీఅధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, సాలహరి తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జి ఎంపిడిఓగా కుమార్‌వర్మ : ఎంపిడిఒ ఈశ్వరరావుకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో ఇంచార్జి ఎంపిడిఓగా ఈఓపిఆర్డీ కుమార్ వర్మకు జిల్లా పరిషత్ సీఈఓ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో కుమార్ వర్మ ఇంచార్జి ఎంపిడిఓగా మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు.

పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు

సర్పంచ్‌లకు అరుదైన అవకాశం కల్పించిన నేత ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్
జనసేన అల్లూరి జిల్లా కార్యదర్శి సీతారాం

విశాలాంధ్ర-చింతపల్లి : నిజమైన దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా పంచాయతీ సర్పంచ్‌లకు స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో జెండా వందనం ఘనంగా నిర్వహించేందుకు నిధులు కేటాయించి అరుదైన అవకాశం కల్పించారని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీ సర్పంచ్ లకు మేజర్ పంచాయతీకి 25 వేల రూపాయలు, చిన్న పంచాయతీలకు పదివేల రూపాయలు చొప్పున నిధులు కేటాయించి దేశ స్వాతంత్ర్య వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. గ్రామపంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు అని భావించిన పవన్ కళ్యాణ్ ఆదిశగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు జన సైనికులు కూడా అందులో భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరులను ఈ సందర్భంగా స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

మాదకద్రవ్యాల నిరోధక అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చింతూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతూరు కళాశాల యన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నసా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్య నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించి కళాశాల నుండి చింతూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించి ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమణిక్యం ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ కార్యక్రమం సందర్భంగా జరిగిన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు యువత బానిసలైపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ఎక్కువ శాతం మందిలో ఈ వ్యవసనం తీవ్రంగా ఉంటోంది. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దేశంలో మాదక ద్రవ్య వినియోగదారుల సంఖ్య 6 కోట్లకు పైగా ఉంది. వీరిలో ఎక్కువ మంది 10 నుంచి 17 ఏళ్ల వయసు వారే అన్నారు.ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ఈ రుగ్మతను నివారించగలమన్న ఆలోచనతో నశా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం కేంద్ర సామాజిక, న్యాయ మంత్రిత్వశాఖ నేతృత్వంలో మొదలైంది అని తెలియజేసారు.మత్తు బాధితులకు సరికొత్త జీవితాన్ని అందించడానికి తెలుగు రాష్ట్రాల్లో సుమారు వంద డీ అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు.మాదక ద్రవ్యాలు తీసుకునే వ్యసనపరుల్లో వివిధ విచిత్ర అనుభూతులు కలుగుతుంటాయి. మొదట్లో ఆనందం కలుగుతుంది. కానీ రానురాను శరీరం ప్రభావాలు తట్టుకోలేదు. మునుపటిలా సంతోషం, ఆనందం కలగవు. అందువల్ల మరింత ఎక్కువ మోతాదులో తీసుకోవాలనే కోరిక కలుగుతుంది. కొంత కాలానికి అది కూడా చాలదు. రానురాను మోతాదు పెరిగిపోయి మెదడు లోని నాడీ కణాల్లో మార్పులు వస్తాయి. చివరికి మాదక ద్రవ్యాలు లేకపోతే ఉండలేని దీనస్థితి వస్తుంది కలుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో భారత దేశాన్ని మాదక ద్రవ్య రహిత సమాజంగా తీర్చి దిద్దటానికి నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది అన్నారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ వై పద్మ, కె శైలజ, సి హెచ్ నాగేశ్వరావు, కె శ్రీలక్ష్మి, కె శ్రీదేవి, సి హెచ్ రాజా బాబు, యన్ రమేష్, జి సాయికుమార్, పి అలివేలు, ఆర్ మౌనిక, మూర్తి, సంగం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసిల్దార్‌కు సన్మానం

విశాలాంధ్ర-గంగవరం : తహసిల్దారిగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై కృష్ణాజిల్లా వెళుతున్న సత్య సులోచనను రెవెన్యూ శాఖ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో ఇంచార్జ్ తాసిల్దార్ వీరభద్రరావు, రీసర్వే డిప్యూటీ తాసిల్దార్ రాంబాబు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జిలాని, మండల సర్వేయర్ వీరప్పదొర మాట్లాడుతూ ప్రజల భూసమస్యల పరిష్కరించారని కొనియాడారు. సేవలను కొనియాడడం జరిగింది. అలాగే గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ సర్వేయర్లు తాసిల్దార్ సేవలను కొనియాడారు. వీఆర్వోలు అప్ప సందర్భంగా కార్యాలయ సిబ్బంది తరుపున డిప్యూటీ తాసిల్దార్లు దుస్సాలువాలు కప్పి జ్ఞాపికను నూతన వస్త్రాలను సమర్పించారు. అలాగే గ్రామ రెవిన్యూ అధికారులు తరపున గ్రామ సర్వేయర్ల తరపున తాసిల్దార్ ను ఘనంగా సన్మానించారు.

ఇంచార్జ్ తహసిల్దార్‌గా వీరభద్రరావు

విశాలాంధ్ర-గంగవరం : ఇంచార్జ్ తాసిల్దార్ గారు డిప్యూటీ తాసిల్దార్ వీరభద్ర అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు పని చేసిన తాసిల్దార్ సత్య సులోచన కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన తాసిల్దార్ వచ్చేవరకు ఈయన ఇన్చార్జిగా తాసిల్దారుగా బాధ్యతలు నిర్వహిస్తారు.

గుడ్డుతో సహా పురుగుల నివారణకు వేప గింజల కషాయం ఎంతో మేలు

వ్యవసాయాధికారి కొల్లు తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట : ప్రస్తుతం పత్తి పంటపై రసం పీల్చు పురుగులు ఆశించాయని రాబోయే రోజులలో గులాబీ రంగు కాయలను తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు వేప గింజల కషాయం ఎంతో మేలని లోపల ఉన్న గుడ్డుతో సహా నాశనం చేస్తుందని వ్యవసాయ అధికారి కే.తిరుపతిరావు అన్నారు. మండలంలోగల గురునాయుడుపేట తదితర గ్రామాలలో మంగళవారం ప్రత్తి పంటలను పరిశీలించారు. పత్తి పూత దశలో ఉన్నందున గులాబీ రంగు పురుగు గుడ్లు పెట్టే సమయం ఇదని వేప గింజల కషాయం పిచికారి చేసుకోవాలని రైతులను కోరారు. వేప గింజల పిచ్చికారి తో పురుగుల ఉద్రితిని తగ్గించాలని గుడ్డిదశలోనే నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. గుడ్డు దశలోనే పురుగుల నివారణకు ఐదు శాతం వేప గింజల కషాయం ఎంతగానో ఉపకరిస్తుంది రైతులు నేరుగా రసాయనాలు పిచికారి చేయకుండా వేప సంబంధిత మందులైన నీమాస్త్రం వేప గింజల కషాయం బ్రహ్మాస్త్రం పంచ పత్ర కషాయం దశపర్ని కషాయం వంటి ద్రావకాలను వినియోగించి పురుగులను నివారించుకోవచ్చని అన్నారు. దీనివలన భూమి ఆరోగ్యం పాడవకుండా ఉండడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడనుందని తెలిపారు. శత్రు పురుగులను నివారించవచ్చని వ్యవసాయ అధికారి అన్నారు. గురివి నాయుడుపేట గ్రామంలో పత్తి పంటలో అంతర పంటల మోడల్ ను సిద్ధం చేస్తూ రైతులకు ఐదు శాతం వేప గింజల కషాయం తయారీని చేసి పిచికారి విధానాన్ని వివరించారు. పత్తి చుట్టూ రెండు వరుసలలో జొన్న లేదా మొక్కజొన్న గట్లపై ఆముదాలు కూరగాయలు వేసుకుని అంతర పంటగా కంది పెసర లేదా మినుము వంటి అపరాలను వేసుకున్నట్లయితే మిత్ర పురుగుల సంఖ్య పెరిగి చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని ఖర్చు తగ్గి అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఈ విధానం ద్వారా కలుపు ఉధృతి తగ్గుతుందని అంతేకాకుండా భూమిలోని తేమ సద్వినియోగపడి జీవ వైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు పోషకాలు అందిస్తుందన్నారు. రైతులు ఏక పంట విధానాన్ని విడనాడి పలుపంటల విధానం వైపు మల్లాలని సూచించారు. అనంతరం వేప గింజల కషాయం తయారీని రైతులకు వివరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గణేష్ ప్రకృతి సేద్య ప్రతినిధులు సూర్యారావు మరియు సుకరమ్మ గ్రామ పెద్దలు ధనుంజయ రావు మరియు రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవంలో కూటమి నాయకులను భాగస్వామ్యం చేయండి

జీ.కే వీధి టిడిపి మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలో నిర్వహించే 78వ గణతంత్ర వేడుకలలో కూటమి నాయకులను భాగస్వామ్యం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ఎం రమేష్ కోరారు. స్వతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించి జెండా ఆవిష్కరణ చేసి, ప్రభుత్వ కార్యాలయాలలో పంచాయతీ, సచివాలయులు, మండల ఎన్డీఏ కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులను భాగ్యసామ్యం చేయాలన్నారు. ఈ మేరకు అన్నిశాఖల అధికారులు చొరవ తీసుకోవాలని జి.కే వీధి టిడిపి మండల అధ్యక్షులు ముక్కలి రమేష్ కోరారు.

25 మినీ గోకులాలు మంజూరు

జూనియర్ వెటర్నరీ అధికారి అప్పన్నబాబు

విశాలాంధ్ర-గంగవరం : ప్రభుత్వం మండలానికి 25 గోకులం (పశువుల షెడ్లు) మంజూరు చేయడం జరిగిందని నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. పథకం లో రైతులకు పశువుల షెడ్ల నిర్మాణం కొరకు పశు సంవర్ధక శాఖ మరియు జాతీయ ఉపాధిహామీపథకం లబ్ధిదారిని భాగస్వామ్యంతో నిర్మాణాల చేపట్టడం జరుగుతుంద న్నారు. ఈపథకం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెండు, నాలుగు, ఆరు పశువులకు, 20, మేకలు, గొర్రెలకు, 100, 200, కోళ్లకు షెడ్లు నిర్మించుకోవచ్చును అన్నారు. నాలుగు పశువుల షెడ్డు నిర్మాణం యూనిట్ విలువ 1,85,000 కాగా ఉపాధి హామీ నుండి లక్ష 66,500, లబ్ధిదారుని వాటా 18500, ఆరు పశువుల షెడ్డు కు యూనిట్ విలువ రెండు లక్షల 30000 కాగా ఉపాధి హామీ ద్వారా రెండు లక్షల ఏడు వేల రూపాయలు, లబ్ధిదారిన మాట 23 వేల రూపాయలు, 20 మేకలకు, గొర్రెల షెడ్డు నిర్మాణం యూనిట్ విలువ 1,30,000 కాగా ఉపాధి హామీ నుండి 91 వేల రూపాయలు, లబ్ధిదారుని వాటా 39 వేల రూపాయలు, మేకలకు, గొర్రెలకు షెడ్డు నిర్మాణం యూనిట్ విలువ రెండు లక్షల 30 వేల రూపాయలు కాగా 1,61,000, లబ్ధిదారిన వాటా 69 వేల రూపాయలు, 100 కోళ్ల పెంపకం షెడ్డు యూనిట్ విలువ 87 వేల రూపాయలు ఉపాధి హామీ నుండి 60 వేల 900 రూపాయలు, లబ్ధిదారు వాటా 26 వేల ఒక వంద రూపాయలు అలాగే మేకలు, షెడ్డు నిర్మాణం యూనిట్ విలువ లక్ష 32 వేల రూపాయలు కాగా ఉపాధి హామీ నుండి 92,400, లబ్ధిదారుని వాటా 39600 అని అప్పన్న బాబు తెలిపారు. ఆసక్తిగల, రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టి సన్న చిన్న కారు రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఆధార్ కార్డు, ఉపాధి హామీ కార్డు, స్థలం హక్కు పత్రం బ్యాంకు పాసుబుక్ సమీపంలోని సమర్పించాలన్నారు.

ఎంపీడీఓకు సత్కారం



విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలో గత ఏడు నెలలుగా విధులు నిర్వహించి తిరిగి స్వంత మండలానికి బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడును బలిజిపేట మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.విద్యాశాఖ అధికారి-1, ఎంఈఓ-1 అసోసియేషన్ ఏపి రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. వారంతా మాట్లాడుతూ గడచిన సాధారణ ఎన్నికల సమయంలో బలిజిపేట మండలం ఎంపిడివో గా విధుల్లో చేరిన రమేష్‌నాయుడు మండల అభివృద్ధి కొరకు విశేషంగా కృషి చేశారని, ఎంతో తోడ్పాటును, సహకారాన్ని అందించారని అన్నారు. మండలంలో పని చేసిన కొద్దికాలంలోనే సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారని, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల పట్ల స్నేహ భావంతో మెలిగారని కొనియాడారు. భవిష్యత్తులో జిల్లా స్థాయి అధికారిగా పదోన్నతి పొందాలని సామల ఆకాంక్షించారు.

ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్, ఉపాధ్యాయులకు షోకాస్ నోటీసులు : ఐటిడిఏ పిఓ

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : మండలంలోని జామిగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాజెక్ట్ అధికారి తనిఖీ సమయంలో ప్రధానోపాధ్యాయులు హాస్టల్లో వార్డెన్ ఉపాధ్యాయులు ఎవరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రధానోపాధ్యాయురాలు ఎం. సుజాత, ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్ కె.లక్ష్మి ఇతర ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావును. ఆదేశించారు. రెండు రోజుల్లో ఉపాధ్యాయుల నుంచి ప్రధాన ఉపాధ్యాయుని నుంచి సమాధానం రావాలని హెచ్చరించారు. పాఠశాల పట్ల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పనితీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం సొవ్వ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమం పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రాన్ని బోధించారు. గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఈరోజు మెనూ ఏం పెట్టారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిడి కొండలరావు, టి డబ్ల్యూ జేఈ అభిషేక్, అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ మధ్యకాలంలో ప్రయాణికులతో ప్రయాణిస్తున్న సరుకు రవాణా వాహనాలు, ఆటో రిక్షా, మాక్స్ కాబ్‌లు అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తూ, ఎక్కువమంది విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు, స్కూల్ ఆటోలు రోడ్ ప్రమాదాలకు గురిఅవుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక తనిఖీలలో భాగంగా జిల్లా రవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ ఆదేశాల ప్రకారం పార్వతీపురం సహాయ ఇంధన శఖట తనిఖీదారులు జి. సత్యనారాయణ, ఎన్. రమేష్ కుమార్‌ల రవాణా శాఖ తనిఖీ బృందం మంగళవారం పార్వతీపురం బెలగాం జంక్షన్ సమీపంలో వాహన దారులకు, పాదచారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక ప్రయాణికులతో ప్రయానించుట వలన కలిగే రోడ్ ప్రమాదాలపై వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించి, నిబంధలను పాటించకుండా ప్రయాణిస్తున్న 19 వాహనములకు అపరాధ రుసుం విధించారు. రోడ్డు ప్రమాదం వలన కలిగే కుటుంబ యజమాని మరణం వలన ఆ కుటుంబం చిన్నాభిన్నం అవడమే కాకుండా అన్ని విధాల నష్ట పోతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్వతీపురం రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో అధిక ప్రయాణికులతో ప్రయాణం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, ఫిట్ నెస్ సర్టిఫికేట్ లేకుండా వాహనాలను నడపడంపై ప్రత్యేక తనిఖీలు విరివిగా జరుగును కావున జిల్లాలో ప్రయాణికులతో వెళ్ళే వాహనదారులు అందరూ వాహన పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించరాదని మరియు వాహనమునకు సంబంధించి అన్ని పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌తో ప్రయాణించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారణకు సహకరించవలసినదిగా జిల్లా రవాణా శాఖాధికారి ఎం.శశికుమార్ తెలిపారు.

హుందా రాజకీయాలే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం ముందున్న లక్ష్యం రాష్ట్ర పునర్నిర్మాణం అన్ని వర్గాల అభివృద్ధి
పాడేరు ఎన్డీఏ కూటమి తెదేపా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు : హుందా రాజకీయాలే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యంమని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి తెదేపా ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ..గెలవాలంటే పెద్ద కష్టం కాదు...కానీ హూందా రాజకీయాలే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యామని,నాటి స్థానిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ అక్రమాల కారణంగా నాడు ఎన్నికల్లో పోటీకీ దూరంగా టీడీపీ ఉందని చెప్పారు.అధికార మార్పిడి తర్వాత స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున కూటమి వైపు వచ్చారని వివరించారు. గెలుపు కాదు ప్రజల అభిప్రాయలు, విలువలు ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ముందున్న లక్ష్యం రాష్ట్ర పునర్నిర్మాణం అన్నివర్గాల అభివృద్ధి అని ఆమె అన్నారు.చంద్రబాబు అత్యంత హుందాగా వ్యవహరించాలని, అధికారంలో ఉండి గెలిచే అవకాశం ఉన్న రాజ నీతి అజ్ఞుడిలా చంద్రబాబు వ్యవహరించడం చాలా సంతోష కారం అన్నారు. విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు టిడిపి, బిజెపి, జనసేన కూటమి దూరంగా ఉండనుందని ఆమె తెలిపారు.

ఎంవిబి సుబ్రహ్మణ్యంకు ఘన వీడ్కోలు

విశాలాంధ్ర-వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ఎంవిబి సుబ్రహ్మణ్యం కు సిబ్బంది ఘన వీడ్కోలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా విజయనగరం జిల్లా దత్తరాజేరు నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో యధావిధిగా దత్తరాజేరుకు బదిలీపై వెళ్లడంతో సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈఈ కళ్యాణదుర్గ, సీనియర్ జూనియర్ సహాయకులు నాగభూషణరావు, సూర్యనారాయణ,టైపిస్ట్ సంజీవరావు, కిషోర్, సచివాలయాల కార్యదర్శులు, పాల్గొన్నారు.

నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన డిఈఓ

విశాలాంధ్ర-పార్వతీపురం : మన్యం జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ మంగళవారం నాడు నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుఆకస్మికంగా సందర్శనం చేశారు. ఉపాధ్యాయులకు అకడమిక్ మానిటరింగ్ పై పలు సూచనలు ఇచ్చారు. రికార్డులను, హాజరును పరిశీలించారు. అన్ని తరగతులకు భోధన ఒకేలా ఉండాలని, పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మధ్యాన్న భోజనం వంటకాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణతో పాటు హెచ్ ఎం మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగి విధులకు హాజరైన ఉపాధ్యాయుడు సస్పెండ్

విశాలాంధ్ర-జిమాడుగుల : మద్యం తాగి విధులకు హాజరైన ఆశ్రమ పాఠశాల సోషల్ అసిస్టెంట్ అప్పల కొండను ఉన్నత అధికారులు. సస్పెండ్ చేశారు. ఈ నెల ఎనిమిదిన జి మాడుగుల ఏ టీ ఢబ్ల్యా ఓ మండలంలోని పెద్ద లోచలి ఆశ్రమ పాఠశాలలో తనిఖీ చేయగా పాఠశాల సమయంలో ఎస్ అప్పల కొండ అనే ఉపాధ్యాయుడు మద్యం తాగి బోజనశాలలో పడుకుని ఉన్నారు. ఇదే విషయాన్ని ఏ టీ డబ్లూ ఓ ఉన్నతాధికారులకు నివేదించగా సదరు ఉపాధ్యాయుని పై సమగ్ర విచారణ జరిపించి మంగళవారం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.ఇదే పాఠశాలలో వారం రోజులలో ఇద్దు ఉపాధ్యాయులు సస్పెండ్ అవ్వడం ఉపాధ్యాయుల వర్గంలో కలకలం రేపింది.

ఆటో డ్రైవర్స్‌కు అవగాహన

ఎస్సై సత్యనారాయణ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : మండల గ్రామాల్లో యువత మత్తు మాదక ద్రవ్యాలకు బానిస అయి తమ జీవితాలని అదిలోనే అంతం చేసుకుంటున్నారని, గంజాయినిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలనిఎస్ ఐ టి సత్యనారాయణ అన్నారు. బుదవారం మండల కేంద్రం రేఖపల్లి లో ఆటో వర్కర్లు తో అవగాహణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కాలంలో గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో మీ మీ వాహనాలలో ఎవరైనా అటువంటి అనుమానితులు తారస పడితే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని ఆటో వర్కర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వి అర్ పురం పోలీస్ శాఖ హెడ్ కానిస్టేబుల్ , కానిస్టేబుల్లు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ కోసం దరఖాస్తులు చేసి విసిగిపోయిన వికలాంగుడు

విశాలాంధ్ర-జీ.మాడుగుల : మండలం వంజరి గ్రామంలో నివాసం ఉంటున్నా లకే బాలయ్యదొర వికలాంగుల పింఛన్ కు ప్రభుత్వ కార్యాలయలకు తిరిగి తిరిగి ఎన్నిమార్లు దరఖాస్తు పెట్టినప్పటికి దరఖాస్తులకే పరిమితం అయింది అని లకే బాలయ్య దొర ఆవేదన వ్యక్తం చెందారు కుటుంబనీకి పోసన కష్టంగా ఉందాని నాపై రాష్ట్ర ప్రభుత్వమే దయుంచు నాకు పింఛన్ మంజూరు చేసి నాకు నా కుటుంబని.రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకుంటారని లకే బాలయ్యదొర కోరడమైనది.

మద్యం దుకాణాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రతపై స్పష్టమైన వైఖరి తెలపాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-పాడేరు : ఏ.పి.యస్.బి.సి.ఎల్. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏ.ఐ.టి.యు.సి ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్నవారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ని కలిసి వినతిపత్రం అందచేయటం జరిగింది.ఈ సందగర్భంగా జాయింట్ కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి మీ విన్నపాన్ని పంపిస్తామని అన్నారని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్ జల్లి రాజుబాబు, అమర్ ఆన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3600 మద్యం షాపులు ఏర్పాటు చేసి పనిలో 15000 మందికి పైబడి ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించడం జరిగిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత టిడిపి ప్రభుత్వం అధికారం లోకి రావటం జరిగింది.అయితే టి.డి.పి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొస్తామని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కావడంతో ఉద్యోగుల్లో భయాందోళన నెలకొన్నదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదుని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో పాటుగా రాష్ట్ర మంత్రులని కూడా కలిసి వినతి పత్రలు అందచేయటం జరిగిందని కానీ నేటికి స్పష్టమైన వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం తెలుపలేదన్నారు. ఈ తరుణంలోనే రాష్ట్ర వ్యాపితంగా అన్ని కలెక్టర్ కార్యాలయాలకు వినతి పత్రాలు నేడు మరొక సారి అందించామన్నారు. ఒకవేళ టెండర్ పద్ధతిలో కనుక మద్యం దుకాణాలు కి అనుమతులు ఇస్తే ఈ ఉద్యోగులను కనుక తొలగించినట్లయితే 15000 మంది ఉద్యోగులు వారి కుటుంబాలు రోడ్డున పడుతారన్నారు.కావున వీరికి ఉద్యోగ భద్రత కలిపించే ఆలోచన చేసి తక్షణమే స్పష్టమైన వైఖరిని తెలపాలని వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రెయ్యల రాంబాబు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో 41 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయని 250కి పైబడి ఉద్యోగులు ఉన్నామని మాకు అందరికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయంచేయాలన్నారు. మేము అంత దాదాపు 35 సంవత్సరాలుకి పైబడి వయస్సు ఉన్నవారే ఉన్నామని మాకు అన్యాయం జరిగితే మా కుటుంభలతో రోడ్డున పడటమే కాకుండా ఆత్మహత్యలే దిక్కవుతాయాని అన్నారు.కావున తక్షణమే రాష్టం ప్రభుత్వం మా పట్ల దయుంచి మాకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, బాలకృష్ణ, సి.హెచ్.రామారావు, నారాయణ, నర్సింగ్, సంజీవ్, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టిన తర్వాతే పని సర్దుబాటు చేయాలి : పీఆర్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-సీతానగరం : ఉపాధ్యాయ పని సర్దుబాటు చేయటానికి ప్రకటించిన సీనియార్టీ లిస్టు లోపభూయిష్టంగా ఉన్నాయని అన్నిసంఘాలు తెలియజేయగా ప్రభుత్వం సోమవారం నుండి తలపెట్టనున్న ఉపాధ్యాయుల సర్దుబాటును తాత్కాలికంగా నిలిపి వేసినట్లు పి ఆర్ టి యు మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వాలేటి తవిటినాయుడు కాగాన విజయ్ లు తెలిపారు. ఎంతో వివాదాస్పదమైన.. విద్యా వ్యవస్థకు తీవ్రనష్టం కలిగించే 117 జిఓ రద్దు చేయకుండానే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయటానికి ప్రయత్నించిన అధికారులకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయన్నారు.ఉదాహరణకు ఈనెల 31న పదవీవిరమణ పొందనున్న ఉపాధ్యాయుల పేర్లు తొలగించకుండా సర్దుబాటు లిస్టులో ఉండటం, ఉపాధ్యాయుల సీనియార్టీ విషయంలో ఏమాత్రం సరిచేయకుండా సీనియర్ల పేర్లు లిస్టు నందు ప్రకటించడం, ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఎస్జీటీలను తొలగించి స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయ పోస్టులో చూపటం వివిధ రకాలైన కారణాలకు ఈరోజు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు.దీంతో వెంటనే ఈరోజు జరగవలసిన సర్దుబాటు ప్రక్రియను ఆపినట్లు తెలిపారు. ఈరోజు నుండి జరగనున్న పని సర్దుబాటును 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపిందన్నారు. జిల్లాలో అదనపు ఉపాధ్యాయుల సంఖ్యఅధికముగా ఉన్నందున వివిధ పాఠశాలకు అవసరమగు ఉపాధ్యాయుల సంఖ్యతక్కువ, ఇంక మిగిలిన ఉపాధ్యాయుల సంఖ్యఎక్కువగా ఉన్నదన్నారు. దీనితో ఎక్కువ మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని, ఇన్ని పోస్టులు మిగులుగా ఉన్నందువల్ల117 జీవో రద్దు చేసి నూతనంగా ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి మార్గదర్శకాలను విడుదల చేసి ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టిన తర్వాత మిగిలిన ఖాళీల నందు పని సర్దుబాటు చేయాలని వారు కోరారు. ఇలా చేయటం వల్ల ఎక్కువమంది ఉపాధ్యాయులు పనిసద్దుబాటుకు గురికారని తెలిపారు. ఈపనిసద్దుబాటును నిలిపివేసి శాశ్వత ప్రాతిపదికను పదోన్నతులు ఇచ్చిన తర్వాత మాత్రమే నిర్వహించాలని కోరారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మహిళలను పారిశ్రామిక వ్యక్తలుగా ప్రోత్సహించడం తమ లక్ష్యమని ఐ సి డబ్ల్యు డి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి శ్రీనివాసరావు అన్నారు. మండలం హనుమంతు నాయుడుపేటలో సమగ్ర శిశు మహిళ అభివృద్ధి సేవా సంస్థ (ఐసిడబ్ల్యుడిఎస్) ఆధ్వర్యంలో, మైక్రో లెండింగ్‌లో భాగంగా నిత్యవసర సరుకుల లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఐ సి డబ్ల్యు సంస్థ మన రాష్ట్రము లో రైతులు, మహిళలు యొక్క ఆర్థిక అభివృద్ధి కి ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలియ చేశారు. మన జిల్లా నుండి ఇతర ప్రాంత లకు వలసలు నివారణకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కలుగజేస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56వేల మహిళా బృందలకు స్వయం ఉపాధి కల్పించామని అన్నారు. మహిళలు స్వయం ఆర్థిక అభివృద్ధికి, ఆర్థికంగా సహకరిస్తూ వారి జీవనోపాధికి ఉపయోగపడే వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ, పరిశ్రమ స్థాపనకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు జి .శ్రీనివాసరావు, అల్లు పోలి నాయుడు, శ్రీకాకుళం, విజయనగరం డివిజనల్ మేనేజర్లు కృష్ణ, శ్రీనివాస్, సంతబొమ్మాళి, టెక్కలి మండల కోఆర్డినేటర్లు సుగ్గ చిన్నరెడ్డి , చరణ్ వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

నిషముక్త భారత్ అభియాన్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: నిషారహిత భారతదేశం దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. నిషముక్త భారత్ అభియాన్‌లో భాగంగా రెండవ రోజు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎం. నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు లోనవుతున్నారనీ, సిగరెట్ తో ప్రారంభించి, తర్వాత ఆల్కహాల్ ఆ తర్వాత డ్రగ్స్‌కు కూడా అలవాటు పడుతున్నారనీ అన్నారు. యువత చెడు మార్గంలో నడవకుండా చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. ఎన్.ఎస్.ఎస్. విభాగం ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, నిరోధించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలనీ కోరారు. అధ్యాపకులు ఆకెళ్ళ రామారావు, శ్రీనివాసరావు, విజయ, వినోద్ రాజు, గౌతమీవీణ, సంగీత, విజయ్, మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవిన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తాసిల్దార్ సుబ్బారావు గురువారం ఒక పత్రిక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. మండలలో గల 62 రెవెన్యూ గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ది.16 ఆగస్టు 2024 తేది నుండి 30 సెప్టెంబర్ 2024 తేది వరకు 45 రోజులు పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించబడునని . ఈ రెవెన్యూ సదస్సులు భూ సంబంధిత సమస్యలు (మ్యూటేషన్ లు, భూ ఆక్రమణ, వివాదస్పద భూమి, సెక్షన్ 22ఏ, ఎల్ సి కార్డులు(లోన్ ఎలిజిబిలిటీ కార్డులు) పరిష్కరించుటకు దరఖాస్తులు స్వీకరించుబడునని ప్రజలు విధిగా పాల్గొని తమ సమస్యలు కొరకు అర్జీలు చేసుకోవచ్చన్నారు.

భగవద్గీత మానవాళికి విజ్ఞాన వారధి

విశాలాంధ్ర-సోంపేట : బాల్య దశ నుండే పిల్లలకు భగవద్గీత పఠనం అలవాటు చేసినట్లయితే దివ్యమైన విజ్ఞాన సంపద సొంతమవుతుందని క్లిష్టమైన పరిస్థితులను సైతం నెగ్గే సకల సద్గుణ శోభితులై పిల్లలు శోభిల్లుతారని ప్రముఖ మనో వికాస నిపుణులు రాంబుడ్డి గణపతి ఉద్భోదించారు. మంగళవారం మాకన్నపురం పంచాయతీలో గల శారదాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమంలో భాగంగా భగవద్గీత ప్రాముఖ్యతను విపులీకరించి విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితంలో వృత్తి నిబద్ధత, స్వీయ క్రమశిక్షణ, మనో వైకల్యం లేమిని తెలియజేసే ఉద్గ్రదంధమని వీటిని పఠించి తరించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుల బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.రాజేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి సామజిక బాధ్యత కలిగి ఉండాలి

సీఐ రుద్ర రాజు బీమరాజు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి సీఐ రుద్రరాజు బీమరాజు, మారేడుమిల్లి ఎస్ ఐ రాము, గుర్తేడు ఎస్ ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డ్రీమ్ వాలీ రిసార్ట్ నందు కమ్యూనిటీ బిల్డింగ్ ఎక్సర్ సైజ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం సమాజన్నిపట్టి వేలాడుతున్న సామజిక ఋగ్మతలనురూపుమపెందుకు, అసాంఘిక చర్యలు అరికట్టెందుకు వివిధ శాఖలమధ్య సమన్వయం ఏర్పరిచి ఏవిధంగా ముందుకువెళ్ళాలి అనే ఆలోచనలు పంచుకోవాలి అనే ఉద్దేశ్యం తో ఈ మీటింగ్ ఏర్పాటు చేయడమైనది.ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోరే వ్యక్తులతో కూడి వారి పరిధిలో ఉన్న సమస్యలువాటిని అధికమించే పరిస్కార దిశగా సూచనలు సలహాలు పంచుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని పోలీస్ వారికి సహకరించగలగాలని, గంజాయి నిర్మూలనకు ఎటువంటి కార్యాచరణ అవలంభించాలో మీ సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, వీరాకిశోర్, సర్పంచ్ కొండా జాకబ్,ఏ పి ఆర్ ప్రిన్సిపాల్. సత్యవతి, పిహెచ్‌సి డాక్టర్. స్వచ్చందసంస్థ నిర్వహకులు, ఆటో యూనియన్ సభ్యులు, బొలెరో యూనియన్ సభ్యులు, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వంటి పలు ప్రభుత్వ శాఖ ల వారు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకుని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

జేసి డా.అభిషేక్

విశాలాంధ్ర-పాడేరు : ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకుని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జేసి మాట్లాడుతూ, ఉదయం 07.30 గంటలకు కలెక్టరేట్ లో జాతీయ జండాను ఎగురవేస్తారని, 09.00 గంటలకు తలారిసింగి పాఠశాల పెరేడ్ గ్రౌండ్ లో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ జాతీయ జండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు. పెరేడ్ అనంతరం శకటాలు పాడేరు వీధులలో తిరగాలని సూచించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీసారు.బుధవారానికి గ్రౌండ్, వేదిక, సీటింగ్ అరేంజ్మెంట్, మైక్ సిస్టం సిద్ధం చేయాలన్నారు.మాస్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు రిహార్సల్స్ పూర్తి చేసి ప్రదర్శనకు సిద్ధం కావాలని ఆదేశించారు. మైదానంలో ఏర్పాటు చేయాల్సిన స్టాల్స్ సిద్ధం చేయాలన్నారు.పోలీస్ కవాతు, ఇతర ప్రదర్శనలు రిహార్సల్స్ పూర్తి చేయాలన్నారు. నిరంతర విధ్యుత్ సరఫరాకు విధ్యుత్ శాఖ చర్యలుతీసుకోవాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రంపచోడవరం నుండి సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్, చింతూరు నుండి ఆర్డిఓ వి. చైతన్య, కలెక్టరేట్ నుండి డిఆర్ఓ బి. పద్మావతి, డిపిఆర్ఓ గోవింద రాజులు, ఎస్డిసి వివిఎస్ శర్మ, తదితరులు, జిల్లా నుండి వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు సచివాలయంలో దరఖాస్తు చేయండి

ఐటిడిఏ పిఓ వి.అభిషేక్

విశాలాంధ్ర-పాడేరు : వితంతు పింఛన్లకు గ్రామసచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఐటిడి ఏ పిఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. మంగళ వారం స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ - డి. ఆర్.డి. ఏ వితంతు పింఛన్లపై నిర్వహించిన అవగాహనా సదస్సు కు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం కార్యాలయంలో సామాజిక పింఛన్ల కోసం డిజిటల్ అసిస్టెంటును సంప్రదించాలని సూచించారు. సచివాలయంలో సిబ్బందిని సంప్రదిస్తే ఎలా దరఖాస్తు చేయాలో పరిష్కారం మార్గం చూపిస్తారని చెప్పారు. సచివాలయంలో పరిష్కారం కాకపోతే ఐటిడిఏకు లేదా ఎంపీడీవో కార్యాలయాలకు రావాలని అన్నారు. రైసు కార్డులో మృతి చెందిన భర్తపేరు ఉంటే పింఛను మంజూరు చేయడం జరగదన్నారు. భర్త మృతి చెంది ఉంటే రేషన్ కార్డులో పేరు తొలగించాలని చెప్పారు. మండల కేంద్రంలో వారపు సంత రోజున పింఛన్లకోసం ఒక రోజు ఎన్టీ ఆర్ పింఛను భరోసా కోసం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 10 ఎకరాలు మెట్టభూమి, 3 ఎకరాల పల్లపు భూమి ఉంటే పింఛను మంజూరుకు అర్హులు కారని చెప్పారు. అనంతరం వెలుగు ఆధ్వర్యం నిర్వహిస్తున్న విస్తర్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లు, కప్పులను స్థానిక హెూటల్స్ కు సరఫరా చేయాలని సూచించారు. హెూటల్స్ లో ప్లాస్టిక్ వినియోగం నిషేధం పై ఎంపిడి ఓను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ పిడి వి.మురళి, ఎంపిడిఓ సాయి నవీన్, ఇఓపిఆర్‌డి రమేష్, ఎంపి ఎం వి. ఎస్. ప్రసాద్ , న్యాయవాదులు పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు తది తరులు రులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ పీఏ పంతులు మృతికి సంతాపం

విశాలాంధ్ర,పలాస: సీనియర్ జర్నలిస్ట్, రచయిత పిఏ పంతులు మృతి టెక్కలి డివిజన్ జర్నలిస్టులకు తీరని లోటని పలాస కాశీబుగ్గ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. సోమవారం పంతులు మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జగదీష్, నేతాజీలు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తొలి అధ్యక్షులుగా పనిచేసి, తుది శ్వాస వరకు సంఘం పట్ల ఎంతో నిబద్ధతతో అయన ఉండే వారని ప్రతిపాదిత ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు డి.మహరణ తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కింజరాపు కృష్ణారావు, రమేష్ రవి, జయంత్, బోస్, సంతోష్, కొంచాడ రవిశంకర్, రాము, దుర్యోధన మహారణ, భాస్కరరావు,వాసు, తదితరులు ఉన్నారు.